క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన జ్ఞానారెడ్డి



పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి

చింతలపూడి: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.జ్ఞానారెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని చెప్పినట్లు జ్ఞానారెడ్డి తెలిపారు. తామంతా వైఎస్ జగన్ వెంటే ఉంటామని 2029లో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకు వస్తామని చెప్పినట్లు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత వెంకట సూర్యనారాయణకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడేనికి చెందిన అల్లూరి సురేష్‌కుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పెదపాడు: మండలంలోని వివిధ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. పెదపాడు మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 8, 9, 10 తరగతులకు చెందిన పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంకా కొన్ని తరగతులకు చెందిన కొన్ని పాఠ్య పుస్తకాలను రావాల్సి ఉందని చెప్పారు.

సీహెచ్‌సీలో సిబ్బంది కొరత

దెందులూరు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2.70 కోట్లతో సీహెచ్‌సీని 30 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేసింది. ఈ వైద్యశాలకు అంబులెన్స్‌లు, సాంకేతిక వైద్యపరికరాలు, వైద్యులు ఉన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చేసిన అభివృద్ధి కారణంగా వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజుకు 130 నుంచి 150కు పెరిగింది. వైద్యులు ఉన్న వైద్య సేవలందించేందుకు పరీక్షలు చేసేందుకు సిబ్బంది కొరత కనిపిస్తోంది. వైద్యశాలలో ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఆరుగురు శానిటరీ సిబ్బంది, నలుగురు సెక్యూరిటీ గార్డులు అవసరం ఉంది. నూతన ప్రభుత్వం సీహెచ్‌సీకి స్టాఫ్ నర్సులు, శానిటరీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డుల పోస్టులను నియమిస్తే మరింత మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించేందుకు వీలుంటుందని ప్రజలు కోరుతున్నారు.

గుండుగొలను జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు



క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

భీమడోలు: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్లే వాహనాలతో బుధవారం ఉదయం జాతీయ, రాష్ట్రీయ రహదారులపై రద్దీ నెలకొంది. రాజమండ్రి, రావులపాలెం తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వాహనాలు గన్నవరం వైపుగా వెళ్తుండడంతో ఒక్కసారిగా గుండుగొలను వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనాదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గన్నవరం వైపు వెళ్లే వాహనాలకు పోలీస్ ఆంక్షలు విధించి, వాహనాలను నిలుపుదల చేయించారు. పాసులున్నా వాహనాలకు మాత్రమే పోలీసులు అనుమతులు ఇచ్చారు. మిగిలిన వాహనాలను నిలుపుదల చేశారు. గుండుగొలను జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు అధికారులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాలను పంపారు.

ముగిసిన గిరిజనుల జాతర



మెరకగూడెంలో సోదెం, రవ్వా వంశీయుల ఇలవేల్పుల జాతరలో పూజలు చేస్తున్న గిరిజనులు



పేన్ కర్రతో నృత్యాలు చేస్తున్న దృశ్యం



మండలంలోని మెరకగూడెంలో ఇలవేల్పు జాతరలో నృత్యాలు చేస్తున్న గిరిజనులు

- సోదెం, రవ్వా వంశీయుల ఇలవేల్పుల జాతర
- పేన్ కర్రతో గిరిజనుల నృత్యాలు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన మెరకగూడెంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సోదెం, రవ్వా వంశీయుల ఇలవేల్పుల జాతర ముగిసింది. ఆదివాసీలైన సోదెం, రవ్వా వంశీయులు ఈ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వంశీయులు భక్తిశ్రద్ధలతో కొలిచే పేన్ కర్రలకు మూడు రోజులపాటు పూజలు చేశారు. అనంతరం ఈ పేన్ కర్రలను భుజాన ఎత్తుకుని వంశీయులు వివిధ ప్రాంతాల్లో బంధువుల మధ్య ఆటపాటలతో, డోలు నృత్యాలతో సందడి చేశారు. ఈ జాతర యాడమర్రులతో, కోయ సంస్కృతి ఆచార వ్యవహారాలతో వైభవంగా నిర్వహించారు. ఈ జాతర మహోత్సవంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన వారికి నిర్వాహకుడు సోదెం సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

బడి గంట మోగింది..

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు



బడిబాట పట్టిన విద్యార్థులు

విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న పుస్తకాలు →



బుట్టాయగూడెం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల్లో ఆటపాటలు, షికార్లతో గడిపిన విద్యార్థినీ విద్యార్థులు ఇకపై పుస్తకాలతో కుస్తీ పట్టవలసిందే. అలాగే ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కూడా కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు-114, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు-8, గురుకుల పాఠశాలలు-7 ఉన్నాయి. వీటిలో సుమారు 9679 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నేటి నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో అర్హులైన వారికి పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లను అధికారులు అందజేయనున్నారు. పదో తరగతితోపాటు ఇంటర్ విద్యలోనూ ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నేడు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ..

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్ట్స్ పంపిణీ చెయ్యనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాల్లో 98642 పాఠ్య పుస్తకాలు, 1,02,692 నోట్ పుస్తకాలు పంపిణీ చెయ్యనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వీటిలో బుట్టాయగూడెం మండలంలో 37,715 పాఠ్య పుస్తకాలు, 40,166 నోట్ పుస్తకాలు, జీలుగుమిల్లి మండలంలో 19,388 పాఠ్య పుస్తకాలు, 20,808 నోట్ పుస్తకాలు పంపిణీ చెయ్యనున్నట్లు తెలిపారు. అలాగే వేలేరుపాడు మండలంలో 11,550 పాఠ్య పుస్తకాలు, 9,722 నోట్ పుస్తకాలు, అదే విధంగా కుక్కునూరు మండలంలో 14,771 పాఠ్య పుస్తకాలు, 16,346 నోట్ పుస్తకాలు, అలాగే పోలవరం మండలంలో 15,718 పాఠ్య పుస్తకాలు, 15,650 నోట్ పుస్తకాలు చొప్పున విద్యార్థినీ విద్యార్థులకు బడి తెరచిన మొదటి రోజే పంపిణీ చెయ్యనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వీటితోపాటుగా బెల్ట్‌లను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు



చింతలపూడి: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సీ.మధుబాబు పిలుపునిచ్చారు. జూన్ 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా కేసులు, మనోవర్తి కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

అనుమతుల్లేని షాపులపై కఠిన చర్యలు

ఏవో ముత్యాలరావు



బుట్టాయగూడెంలో బస్తాల నుంచి విత్తనాలను సేకరిస్తున్న ఏవో ముత్యాలరావు

బుట్టాయగూడెం: అనుమతుల్లేని షాపుల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి డీ.ముత్యాలరావు హెచ్చరించారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో బుధవారం విత్తనాల షాపుల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అందుబాటులో గల ధాన్యం విత్తనాలు ఎంటీయూ-1064, పీఎల్ఏ-1100, బీపీటీ-5204 విత్తనాల శాతం, నాణ్యత నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరించిన విత్తనాల నమూనాలను తాడేపల్లిగూడెంలోని కోడింగ్ సెంటర్‌కు పంపిస్తామని తెలిపారు. విత్తనాల షాపు యజమానులు తప్పనిసరిగా మొలకకట్టి షాపుల్లో ప్రదర్శించి విత్తనాలు అమ్మాలన్నారు. అదే విధంగా రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు తప్పనిసరిగా బిల్లులు రాసి రైతులకు ఇవ్వాలన్నారు. అలాగే రైతులు విత్తన షాపుల్లోనే విత్తనాలను కొనుగోలు చెయ్యాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద, ప్రైవేట్ షాపుల్లో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో షాపు యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: అశ్వారావుపేట రోడ్‌లో కొలువైన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 1600 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాద వితరణలో చింతలపూడి సరోజిని గులాబ్‌జామ్ అందించగా, చల్ల వరప్రసాద్, కుటుంబసభ్యులు అందించిన ద్రవ్య సహాయంతో అహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే బుట్టాయగూడెంలోని అనాథ, చిన్న పిల్లల ఆశ్రమానికి అహారాన్ని పంపించినట్లు అన్నప్రసాద వితరణ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్‌రెడ్డి, చెన్నూరి శివాజీ కృష్ణ, కల్లూరి మురళీకృష్ణ, ఘనమని శ్రీనివాస్, చల్లా వరప్రసాద్, శ్రీధరాల శ్రీనివాస్ వెంకట గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



చిన్నారులకు మిఠాయిలు పంచుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం కాలేజీ రోడ్డులో సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ వైస్ ప్రెసిడెంట్ కె.సుగుణకుమారి, న్యాయవాదులు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్ సుగుణ కుమారి మాట్లాడుతూ చిన్న వయసులోనే బాలలకి సరైన వసతులతో కూడిన విద్యను అందించి బాల కార్మిక వ్యవస్థ నుంచి రక్షించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాదేపల్లి క్రాంతి కుమార్, భువనేశ్వరి, లత కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పైపైకి కూరగాయల ధరలు



పత్తేబాద రైతుబజారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశంలో చుక్కల్ని చూస్తుండడంతో.. వాటిని కొనేందుకు ప్రజలు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఏమీ కొనలేని, తినలేని పరిస్థితి నెలకొందని ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. బుధవారం స్థానిక రైతుబజారులో కూరగాయల ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తిపోయారు. స్థానిక రైతు బజారుల్లో టమాటాలు కిలో జూన్ 3వ తేదీన రూ.40 ఉండగా, జూన్ 5న 52, బుధవారం రూ.52కు విక్రయించారు. కాకరకాయలు కిలో రూ.44 నుంచి 50కు ఉల్లిపాయలు రూ.30 నుంచి రూ.38కు, బీరకాయలు రూ.44 నుంచి రూ.60, కాప్సికమ్ రూ.70 నుంచి రూ.98కి, అల్లం రూ.160 నుంచి 180కి, కొత్తిమీర కట్ట రూ.30 నుంచి రూ.50కి, తోటకూర, పాలకూర, చుక్కకూర వంటి ఆకు కూరలు కట్ట రూ.12 నుంచి రూ.15కు పెరిగిపోయాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ధరలు పెరుగుదలపై వారు పెదవి విరుస్తున్నారు.

పంచాయతీ ఆశీల సొమ్ము పక్కదారి

- కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ
- కాంట్రాక్టు ఉద్యోగిపై కార్యదర్శి ఫిర్యాదు



ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయం.

ద్వారకాతిరుమల: స్థానిక పంచాయితీలో ఆశీల సొమ్ము స్వాహా అయ్యింది. దీనిపై ఈవోపీఆర్డీ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేయగా, సదరు కార్యదర్శి ఆశీలు వసూలు చేసిన కాంట్రాక్టు ఉద్యోగిపై బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. వివిధ ప్రాంతాలకు చెందిన కొందరు వ్యాపారులు నిత్యం ద్వారకాతిరుమల క్షేత్రంలో రోజువారి వ్యాపారాలు చేస్తుంటారు. నిమ్మకాయలు, జామకాయలు, కొబ్బరి బొండాలు, కూరగాయలు ఇలా రోడ్డు పక్కన వ్యాపారాలు సాగించే వారి వద్ద నుంచి ఆశీలు వసూలు చేస్తుంటారు. ఒక్కో దుకాణం నుంచి రూ.25 వసూలు చేస్తారు. ఈ ఆశీలు వసూలు చేసుకునే హక్కుకు ప్రతి ఏటా పంచాయతీ అధికారులు బహిరంగ వేలాన్ని నిర్వహించి, హెచ్చు పాటదారుడికి ఆ బాధ్యతను అప్పగిస్తారు. అయితే గత పాటదారుడి ఆశీల వసూలు హక్కు ఈ సంవత్సరం మార్చి ఆఖరుతో ముగిసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వేలాన్ని నిర్వహించే వీలు లేక ఆశీల వసూలు బాధ్యతను పంచాయతీ వారే చేపట్టారు. పంచాయతీలో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్న రామారావు ఈ ఆశీలను వసూలు చేస్తున్నాడు. అయితే ఆ సొమ్ము పంచాయతీకి జమ కావడం లేదని గుర్తించిన ఈవోపీఆర్డీ ఏవీ.సుబ్బరాయన్ పంచాయితీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావుకు బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీంతో కార్యదర్శి వెంకటేశ్వరరావు కాంట్రాక్టు ఉద్యోగి రామారావుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పక్కదారి పట్టిన ఆశీల సొమ్ము సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని తెలుస్తోంది.

గుంటుపల్లి గ్రామస్తుల పాదయాత్ర



ద్వారకాతిరుమలకు పాదయాత్రగా వెళుతున్న కూటమి నాయకులు

కామవరపుకోట: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా బుధవారం గుంటుపల్లి గ్రామ పంచాయతీలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. స్థానిక కొత్తూరు రహదారి బంగ్లా వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్రగా ద్వారకా తిరుమల వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతిన వెంకటరావు, సర్పంచ్ గోరింక దాసు, ఎంపీటీసీ కంతమనేని అంజిమూర్తి, పుష్పరాజ్యం, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, చెత్త సేకరణకు 49 పుష్ కార్ట్స్‌ను కొనుగోలు చేశామని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పుష్ కార్ట్స్‌ను నగరంలోని అయా సర్కిల్స్‌కు మేయర్ నూర్జహాన్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో 16 సర్కిల్స్‌లో సుమారుగా 700 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. ఇంటింటా చెత్త సేకరణకు ఉపయోగించే (4బిన్) ట్రాలీలకు చక్రాలు సరిగా పనిచేయక, ట్రాలీల్లో చాలా వరకు మరుగునపడ్డాయని తెలిపారు. వాహనాలు వెళ్లని ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణ కోసం నగరపాలక సంస్థ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి 49 పుష్ కార్ట్స్ కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

15 నుంచి రైతు కూలీ సంఘం మహాసభలు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఏలూరులో నిర్వహించే రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఏలూరులోని పాతబస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

పాఠశాలలకు విద్యార్థుల కిట్లు



టి.నరసాపురంలో విద్యార్థుల కిట్లు ఉపాధ్యాయులకు పంపిణీ చేస్తున్న దృశ్యం

టి.నరసాపురం: మండలంలోని అన్ని పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్ బుధవారం పంపిణీ చేశారు. టి.నరసాపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి మొదటి విడత పంపిణీలో భాగంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్ట్‌లు ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మొత్తం 60 పాఠశాలలు ఉండగా, వాటిలో 4585 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరికి అందించేందుకు 21450 పుస్తకాలు వచ్చాయని, బుధవారం 8 పాఠశాలలకు పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు.

పొడపాము హల్‌చల్



అన్నమాచార్య విగ్రహం వద్ద గార్డెన్‌లోని నీటిలో వెళుతున్న పొడపాము

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అన్నమాచార్య విగ్రహం వద్ద ఒక పొడపాము బుధవారం ఉదయం హల్‌చల్ చేసింది. వివరాల్లోకి వెళితే.. చినవెంకన్న దర్శనార్థం భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ గుండా ఆలయంలోకి వెళుతున్నారు. ఆ సమయంలో క్యూ కాంప్లెక్స్ పక్కన అన్నమాచార్యుని విగ్రహం వద్ద గార్డెన్‌లోకి ఒక పొడపాము ప్రవేశించింది. నీటిలో వెళుతున్న ఆ పామును చూసి అక్కడున్న భక్తులు భీతిల్లారు. అయితే పాము పక్కనే ఉన్న మొక్కల్లోకి వెళ్లిపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు



గంగానమ్మ గుడిసెంటర్‌లో సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో పట్టణంలో టీడీపీ నాయకులు జెండాలతో నినాదాలు చేశారు. గంగానమ్మ ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణంలో డీజే వాయిద్యాల నడుమ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, బూరుగుపల్లి సూరిబాబు, ఉక్కుర్తి సీతారామ్, తేలు ప్రసాద్, కోనేటి చంటి, మద్దిపాటి నాగేశ్వరరావు, కొంచాడ ప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన సంబరాలు



కుక్కునూరులో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

కుక్కునూరు: జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కల్యాణ్ బుధవారం నూతన ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం పట్ల జనసేన నాయకులు సంబరాలు నిర్వహించారు. కుక్కునూరు ప్రధాన సెంటర్లోని జీకే టెక్నాలజీస్ వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జనసేన మండల ఉపాధ్యక్షుడు మంత్రి గోపాలకృష్ణ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.